# పడగ నీడ



-ధరణికోట రమేష్ కుమార్

"ఏంరా సురేష్ ఏంది సంగతి బాగున్నవా?"

"ఆ- ఏం బాగలేండి సార్ ఇట్లవున్న" జవాబిచ్చాడు సురేష్.

"ఎట్లా నడుస్తున్నది పని అంతా బాగున్నట్టేనా?"

"మీకు తెల్వందేమున్నది సార్!ఇంతకీ మీరు ఎక్కడున్నరు సార్ ఇప్పుడు?"

"ఎక్కడంటావు చాలా దూరం పోయిన, భారతి ఎట్లున్నది?"

"ఆ బాగనే వున్నది."

"ధర లెట్లవున్నయి."

"ధరలు కొద్దిగ మంచిగనే వున్నయి. ఎంత కష్టపడ్డా రోజు కూలి గిట్టుబాటు అవ్వదు కష్టంగున్నది సార్."

"ఆ ఆ నువ్వు కూడ మాటలు బాగనే నేర్చినవ్. నీ కొడుకు నువ్వు కలిసి మా బాగ సంపాదిస్తున్నరంట, తెల్వదనుకున్నావ్ నాకు?"

"అన్ని సంగతులు తెలిసిన మీరే ఇట్లంటె నేనేమంట సార్, చేతికి నోటికి దూరం నిజంగ చెబుతున్న. ఇంకా జర ఎక్కువయ్యింది, పిల్లలు పెద్దోల్లయ్యిన్రు"

"ఇంకాఅదే లెక్కంటె ఎట్ల, బండి కొనుక్కోవాలి. లేదంటె నలుగురు కలిసి లారీ కొనున్రి, నిముషాలల్ల బంగ్లలు కట్టొచ్చు"

"ఒక్కసారి ఆపితే మాల్‌కి మాల్ గయబ్, బండికి బండి గయబ్, బతుక్కి బతుకు గయబ్"

"ఈ టైమ్‌ల ఇక్కడున్నవేంది ఎల్లోరా లేదా ఇయ్యాలా?"

"ఇంక పది నిముషాలల్ల వస్తదది, దానికే పోవాలి, భారతి వస్తది. సార్‌ని కలిసేదుండే, కలుద్దామని వచ్చిన"

"నీ జిందగీ అంత రైళ్ళకే రాసిచ్చినట్లున్నవు, నీ పనే బాగుంది" అన్నాడు మాధవరావ్.

"వస్త సార్ చాయ్ పంపిస్త తాగున్రి, గరీబోన్ని జర యాదుంచుకోండి" ఆ గది నుండీ బయటికి వచ్చిన సురేష్‌కి రావు సార్ అన్న మాటలే గుర్తొస్తున్నాయి. "నీ జిందగీ అంత రైళ్ళకే రాసిచ్చినట్లున్నవ్!"

రైల్వే స్టేషన్‌లో కనిపించిన టి.టి.ఐ.ని "నమస్కారం సార్" పలకరించాడు.

"నమస్తే ఏంరా సురేష్ బాగున్నవా, ఈ టైమ్‌ల ఇక్కడున్నవేంది ఎల్లోరాలో వుండాల్సినోడివి."

"కొద్దిగ పనుండి వచ్చిన, ఎల్లోరల ఇప్పుడు భారతి వస్తది."

"నీకేం రాజయినవ్, పిల్లలు చేతికి అందొచ్చిన్రు కిస్మత్‌ధార్‌వి."

"మీ దయ సార్."

"ఆ నా దయేం వుంది, అంతా దేవుని దయ, అది సరే ఈ నెలల ఇంకా నన్ను కలవలేదు ఏంది సంగతి, మరిచిపోయినవా?"

"అమ్మమ్మ ఎంత మాట సార్! మిమ్మల్ని మరిచి పోతనా? సార్లు మిమ్మల్నందర్ని కలిసిపోదామనే వచ్చిన. దీన్ని వుంచండి"అంటూ చిన్న ప్యాకెట్ అందించాడు.

"అంతా బరో బరే వున్నది కద."

"ఆ అంతా సక్కంగనె వున్నది, ఆలశ్యమయ్యింది కోపం చెయ్యకన్రి సార్"

"మార్కెట్ బాగున్నదని విన్న, అన్నీ ఎక్కువయితున్నయి అని తెలిసింది. మా రేట్లు పాతవే వుంచితే ఎట్ల? అది కాకుండ కొడుకుని కూడ పనిలకి దింపినవ్ వచ్చే నెల నుంచి పెంచుదామనుకుంటున్న"

"అమ్మ అంత మాట అనకున్రి సార్. మీ మాట ప్రకారం అంత మంచిగానే జరిగితె అట్లనే చేద్దాం, అయినా ఈ యాపారం గురించి తెల్వనట్ల అంటున్న రేంది సార్"

"నమస్కారమండీ శర్మగారు" అటుగా వచ్చిన స్టేషన్ మాస్టర్ అన్నాడు.

"రెండు మూడు రోజుల నుండి కంగారుగా వున్నారు సురేష్ గురించి కలిసినట్లేనా"

"ఆహా కలిసినట్టే అన్ని విధాలుగా"

"వస్త సార్ ఎల్లోరా ఒచ్చింది, నమస్తే" అక్కడి నుండి నడిచాడు.

తొక్కిసలాట ప్రారంభమయ్యింది.

"ని జర్గమంటుంటె"

"సస్తినా బాబు"

"కాలు బెట్టుడే కష్టమంటుంటె నువ్వేడి కస్తున్నవ్"

"అయ్య జాగీ రీడేమన్న వున్నదా? అంత పెద్ద బస్త ఏడ బెడ్తవ్"

"ఊకోర బావు ఆడు మన లెక్కనే అస్తున్నడు, మన కడుపుల మనమే కొట్టుకొనుడు మంచిగ నంటవా?"

"అమ్మ సస్తి,మనిషిననుకున్నవా గొడ్డుననుకున్నవా అట్ల తొక్కుతున్నవ్?"

"కాలును జర చూసి జరపరాదు"

తొక్కిసలాటలో ముందుకు జరిగి కొస్తంత స్థలం సంపాదించుకున్నవారి కళ్ళల్లో ప్రపంచాన్ని జయించి నంత ఆనందం కనిపించింది— అప్పటి దాకా వేరే వాళ్ళని, వాళ్ళ మాటల్ని పట్టించుకోకుండా ముందుకు జరగడానికి ప్రయత్నించినవాళ్ళు, మళ్ళీ తమలాగే దూసుకువస్తున్న వాళ్ళ గురించి అవే రకమయిన ఆలోచనలు, అవే మాటలు!

"ఈ డబ్బులకి ఎవ్వర్ని రానియ్యకున్రి, దర్వాజ మొయ్యమంటుంటె నిక్కాడు"

అప్పుడే అక్కడికి వచ్చి చేరిన రాజన్న అంటున్నాడు.

"నాయబ్ సార్ ఇన్‌స్పెక్షన్‌కి అచ్చిండు జరు గున్రి" అన్నాడు అటెండర్ ఆయన వెనక ఇద్దరు పోలీసులు.

"నమస్తే సార్" శబ్దం ఎండిపోయింది అక్కడ.


స్వీట్ రివెంజ్


నిర్భయ్ నగర్ కాలనీ రచయిత

యర్రంశెట్టి శాయి



మళ్లీ తనదైన బాణీలో రాస్తున్న సీరియల్?


ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 9-2-90



ప్రతి ఒక్కళ్ళూ చేతులు జోడించి నమస్కారం చెబుతున్నారు.

రావటీవితో నడుస్తున్న నాయబ్ సాబ్ అడిగాడు "ఏడెవడో కొత్తోని లెక్క వున్నడు ఏంది సంగతి?"

"ఈడు కిషన్‌గాని కొడుక్కు సార్, ఆనికి బీమార్ చేస్తే మంచంల వున్నడు. పది దినాలాయె ఈడు రాబట్టి. అంగో సార్ ఈశ్వర్‌గాడు మొన్న యాద్ జెయ్యమన్నరు."

"ఏంరా బిడ్డ, ఈశ్వర్ ఏంది సంగతి? సొయ్యన వెంల కల్వకనే పోతివి ఏంది సంగతి?"

"బాంచనోన్ని దొర మాఫ్ జెయ్యి, సొయ్యన్నెల నేను పనిలకి రాలేద్సార్, మా నాయన కాలం జేసిండు" వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ అన్నాడు.

"ఆ నువ్వు రాలేదా? నన్ను నమ్మమంటావు?"

"నిజమే చెబ్తుండు సార్, పాపం సొయ్యన్నెల అన్నలేక్క రాలేదు" పక్కనే వున్న రామయ్య అన్నాడు.

"అన్ని కాదు సార్, ముందు ఈని మాల్ జప్తు చెయ్యండ్రి, లావు లావు మాట్లాడుతుండు" అన్నాడు అటెండర్.

"మాఫ్ జెయ్యిసార్ తెల్వకన్నడు, ఏంరా రామయ్య ఏం సంగతి, పక్కంగ బతికేదున్నదా లేద? నీ కెందుకు పెద్దోల్ల మాట్లల్ల తలబెడ్తవ్, మాఫ్ జెయ్యి సార్ తెల్వకన్నడు రామయ్య" అన్నాడు ప్రక్కనున్న రఘుపతి.

"ఏంరా తిక్కలోడ, సార్లకే లెక్కలు చెబుతున్నావ్! నువ్వు వస్తే ఎంత రాకపోతె ఎంత, ఇప్పుడయితె వస్తున్నవు కద. వాళ్లు దివాలు వచ్చి యాపారం చేసుకోవాలి అని అనుకుంటె వాళ్ళకి కోపం రానియ్యకు"

"ఏద్నుండి తెమ్మంటవే నీకు తెల్వందేమున్నది!"

"అగ్గోర బిడ్డ లావు లావు మాటలంటున్నవు, జప్తుకరో మాక్కా సాలేకా మాల్" అన్నాడు నాయబ్ సాబ్.

"యాద్నుండి తేవాలంటవ్‌రా బిడ్డ? పెండ్లాన్ని సండబెట్టియాడనన్న, సార్‌కి కోపం వస్తె ఏం చేస్తడో నీ కెర్కగద, నీ మాల్ జప్తు చేస్తె ఎంత ఇదయితది జర ఆలోచించుకో" అటెండర్ అన్నాడు.

"ఆనితోని నీకేం మాటలు, పోలిస్ కేంచో ఉస్కా మాల్, ఆ కాయితాలిటియ్యి"

"తప్పయింది సార్ కండ్లెర జెయ్యకుండ్రి, వాళ్లు దివాలాగుండ్రి మీ మాల్ మీకు పోంచాయిస్త" కాళ్ళు పట్టుకున్నాడు ఈశ్వర్.

"కోపంకి రాకండ్రి సార్ ఆడు అంటున్నడు కద వాళ్లు దివాలాగమని ఆగి చూద్దాం" సమాధానపరిచాడు అటెండర్.

"నువ్వు జెప్తున్నవని ఆనికి ఈ మోఖ ఇస్తున్న, వాళ్లు దివాలాగినంక ఆడు అన్నట్టు చెయ్యకపోవాలి. మాసోక్కండ్రి బిడ్డల్లార డబ్బ డబ్బంత కాళీ చేయిస్త. సోసీ పాపం అంటే నెత్తికెక్కుతున్నరు! ఆఫీసుల తరక్కే అన్న దొర్కుతది" ముందుకు పోయాడు నాయబ్ సాబ్.

"నమస్తే సార్" భారతి అన్నది.

"ఆ ఆ నమస్తే ఏం సంగతి భారతి బాగున్నవా?"

"ఆ బాగున్న"

"ఆడు నా కొడుకు లక్ష్మన్ సార్. పనిలకి షురు నయ్యిండు"

"నీ కేంరా బిడ్డ మంచి కండబట్టే వున్నడు నీ కొడుకు. క్వింటల్ వడ్లని ఒక్క చేత్తోని లేస్తడు. నీ పేరు నిలబెడ్తడు తియ్యి."

బతుకు భయం పడగనీడ అని తెలిసినా తాత్కాలికంగా తల దాచుకుందామన్న దుస్సాహసాన్నిస్తుంది. కన్ను బుస్సులను భరిస్తూనే, కాటు నుంచీ తప్పించుకోవాలన్న ఎత్తుగడలనిస్తుంది. అయితే, కాటు తినక తప్పదని తెలిసినప్పుడూ? పడగకే కాదు, పడగనీడన తలదాచుకున్న తనలోనూ తరతరాల నాటి విషముందని తెలిసినప్పుడూ!

"ఆనిదంత భారతి పోలిక సార్. పని అంటె పానం బెడ్తదు."

"ఇంతకీ ఆ పిల్ల యెవరు" పక్కనే వున్న అమ్మాయిని చూయిస్తూ అడిగాడు అటెండర్.

"అది నా బిడ్డ సార్ ఇందిర."

"ఆ-బిడ్డనా? ఇంత కాలం చెప్పకపోతివి, నీకు బిడ్డ వున్న సంగతి! పెండ్లీడుకి వచ్చింది ఎవరికిస్తున్నవ్? మీ వోల్లకా, లంబడోల్లకా?"

"దాని కిస్మత్ యాడుంటె ఆడికి పోతది."

"సుక్క లెక్క వున్నది, దాన్ని లంబడి దానికి పుట్టిన బిడ్డ అంటె ఎవ్వరు నమ్మరు."

"బ్రాహ్మణ బీజం సార్ మరి" అన్నాడు అటెండర్.

తన బిడ్డని మెచ్చుకోలుగా ఆ సార్లు చూడడం సురేష్ మనసు ఏ మాత్రం ఇష్టపడలేదు. ఆ సార్లు కాకుండా ఇంకెవరయిన తన కూతుర్ని మెచ్చుకోలుగా చూసి వున్నట్లయితే గర్వంగా భావించగలిగేవాడు, ఆ సార్ల గురించి పూర్తిగా తెలిసినవాడాయె. ఎట్లా హర్షించ గలుగుతాడు?

వాళ్ళు తన కూతుర్ని చూస్తున్న చూపులు గుండెల్లో శూలాలయి గుచ్చుకున్నయి.

"సార్లకి నమస్తె చెయ్యి" కూతురికి చెప్పాడు సురేష్.

"నేను మీ దెగ్గరికి వచ్చిన కద కష్టమయితదని ఇవ్వాళ తీసుకొచ్చింది భారతి"

"మల్ళీ ఎప్పడొస్తున్నవ్ ఈడికి."

"ఏం పనున్నది సార్ ఇప్పుడు! మళ్ళీ వారం వస్త"

"రా మరి మాట్లాడేదున్నది" కదిలిపోయాడు నాయబ్ సాబ్.

భారతి వైపు చూసాడు సురేష్.

జవాబు చెప్పలేని స్థితిలో భారతి చూపుని క్రిందికి మరల్చుకుంది.

ఒకరి చూపు ప్రశ్నలు కురిపించేది అయితే ఇంకొకరి చూపు వాటికి జవాబుల్ని వినిపించేది.

ఇద్దరి చూపులూ రైలు ప్రయాణంలో ప్రపంచాన్ని మరచిపోయి ఆనందిస్తున్న కూతురి వైపుకి తిరిగాయి.

నడుస్తున్న రైలుతో పాటుగా సురేష్ ఆలోచనలు పరిగెత్తుతున్నవి.

ఒక్క నిముషం చిన్నతనం గుర్తొచ్చింది.

గర్బ దరిద్రంలో గడిపిన బ్రాహ్మణ జీవితం కళ్ళ ముందు తెరలుగా కదిలింది. "అన్ని జన్మల్లో కెల్ల మానవ జన్మ ఉత్తమమయినది, మానవ జన్మలో బ్రాహ్మణ జన్మ అత్యుత్తమమయినది, ఎన్నో జన్మల పుణ్యం వండి బ్రాహ్మణ జన్మ లభ్యమవుతుంది" అని చెప్పిన అమ్మమ్మ కళ్ళ ముందు ఒక్క నిముషం కనిపించింది.

ఇవ్వాళ రెడ్ల ఇంట్లో పెళ్ళి వుంది అనో, ఇంకెవరి దెగ్గరో తద్దినం వుందనో "నాన్నగారు వస్తారు, బియ్యం నూనే తీసుకొస్తారు. కాస్త ఆగండ్రా వంట చేసి పెడతాను" అంటూ వుండే అమ్మ గుర్తొచ్చింది.

గుడిలోని పూజారికి వేసిన దక్షిణలో భాగం అడిగిన దేవాలయ కమిటీ సెక్రటరీ కళ్ళకి కనిపించాడు.

కనీసం కొబ్బరి కాయల్నయినా పూజారికి ఇవ్వకుండా ఇండ్లల్లో స్వీట్లకీ, కూరలల్లో మసాలాకీ ఉపయోగించడం జ్ఞాపకమొచ్చింది.

"కోపమొచ్చిందా" అడిగింది భారతి.

"ఏం లేదు"అన్నట్లుగా తల ఊపాడు.

"సార్లకి ముట్టజెప్పినవా?"

"ఆ లేకుంటే ఊర్కుంటరా?"

"నేను వద్దనే చెప్పిన ఇందిరకి. కానీ చిన్న పిల్ల ఊర్కె రైలు రైలు అంటది, అదేగాక నువ్వు లేకపోతివి, అప్పటికే ఆదా క్వింటలు తక్కువయ్యింది, మొయ్యలేక పొయ్యినం"

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు సురేష్‌కి.

"నీ జిందగీ అంత రైళ్ళకే రాసిచ్చినట్లున్నవ్" రావు సార్ అన్న మాటలే చెవుల్లో మారుమోగినయి.

అవును నిజం. గడిచిపోయిన పధ్నాలుగు సంవత్స రాల తన జీవితం రైల్లోనే గడిచిపోయింది. ఎన్నో రకాల అటుపోట్లు.

దినదినం మారిన, మారుతున్న పరిస్థితులు.

జీవితంలో అలసిపోయిన తండ్రి పక్షపాతంతో మంచాన పడడం గుర్తొచ్చింది."ఈ పిల్లల్నంతా ఎట్లా పోషించాలి భగవంతుడా!"అంటూ, ఎక్కిళ్ళు పడుతూ ఏడ్చిన అమ్మ ఏడుపు ఒక్క క్షణం వినిపించింది.

పెరగని వయసులో నిండని కడుపు రోడ్లమీద తిప్పింది తనని.

"నేనూ మా నాయన కలిసి ఈ దేశం నుండి మరాఠా దేశం పొయ్యేస్తిం. అక్కడ ఆ దేశంలో వడ్లు, ధాన్యంకి కరువుండదంట. అందుకని ఈడ నుండి వాటిని తీసుకుపొయ్యి అమ్మేస్తము"

'రైళ్ళ టి.సి. సార్ ఏమనడు, సర్కిల్ సార్ ఏమనడు, నాయబ్ సార్ ఏమనడు- ఎందుకంటే మా నాయన నెలల ఒక్కసారి పొయ్యి వాళ్ళని అరుసు కుంటడు మరి.'

'నవీపేట్ల ఎక్కి బాసర్ టేసను దాటిన దాకనే కష్టం, తరువాత చేఫికారు ఎవ్వరేం అడగరు ఇంక ధర్మాబాద్ వచ్చినట్లనే'

'ధాన్యాన్ని సైకిండ్ల మీద తీసుకుపోతరు పట్టుబడ్తె మాత్రం కష్టం.'

'ఇంకో సంగతి- గాడ్దెల మీద బియ్యాన్ని ఏసి కూడా తీసుకుపోతరు కాని, పరేషాన్ ఎక్కువ, ఎవ్వరన్న పట్టు కుంటే మాత్రం మాల్ అట్లనే వదిలెయ్యాలి. ఎవర్నీ అడుగుతందుకు వుండదు.'

'బండ్లల్ల తీస్కపోతె పద్దల్ బాగానే వుంటది కాని, బండిని జప్తు చేస్తే ఉరితాడే మిగుల్తది'

'కొన్నిసార్లు గమ్మత్తయితది వచ్చిన సార్లు బక్క పల్చగ వుండి, తక్కువ మంది వుంటె బండ్లల్లున్నోళ్లు సార్లని పొట్టు పొట్టు గొడ్తరంట! కాని సార్లతోని పెట్టు కుంటె మా కష్టం- సార్ల పగ నాగుపాము పగ.'

మంగీరావ్ చెప్పిన మాటలు అంచలంచెలుగా గుర్తొచ్చినయి.

'ఈ వెధవ, బ్రాహ్మణుల ఇంట్ల పుట్టి కులాన్ని భ్రష్టు పట్టించాడు. ధాన్యాన్ని దొంగ రవాణా చేస్తు న్నావా? ఛీ! ఛీ! నీదీ ఒక బ్రతుకేనా' తల్లి అన్న మాటలు గుర్తొచ్చాయి.

'ఏంటీ? లంబాడీదాన్ని పెళ్ళి చేసుకున్నావా? ఈ నాటితో నీకూ నాకూ సంబంధం చెల్లు' అంటూ మంచంపై నుండే నువ్వుల్ని వదులుకొని బ్రాహ్మణ్యాన్ని ఆనందంగా మనసు నిండా నింపుకున్న తండ్రి గుర్తొచ్చాడు.

తను ఒకదారి ఎంచుకున్నాడు. ఆ దారిలో నడిచే వాళ్ళు తనకు మిత్రులు, స్నేహితులు! తను పెళ్ళి చేసుకోవడం అటువంటి వాళ్లనే అయితే జీవితం సాఫీగా సాగిపోతుంది అనే ఉద్దేశ్యంతోనే భారతిని పెళ్ళి చేసు కున్నాడు, మనిషికి తిండిపెట్టేది కులం కాదు, అట్లాంటప్పుడు తను చేసిన పని తప్పు ఎందుకవు తుంది?

ఆలోచిస్తూ, ఆలోచిస్తూనే జీవిత కాలం గడిచి పోతూంది.

ఎక్కే రైలు, దిగే రైలు నవీపేట, ధర్మాబాద్ ఇవే పదాలు నిద్రలో సైతం తనని పట్టుకొని వుంటాయి. పోనీ ఇంత కష్టపడ్డా ఫలితం ఏమయినా వుంటుందా? అదీ లేదు. ప్రతి నెలా తనదంటూ సొంత వ్యాపారం ప్రారంభించాలి అని అనుకోవడం, మళ్ళీ ఏదో రకం వృధా ఖర్చులు, మార్కెట్‌లో అప్పుడప్పుడూ ధర పూర్తిగా పడిపోవడం, అన్నీ సవ్యంగా వున్నాయి అను కున్నప్పుడు చెక్‌పోస్టువాళ్ళ జప్తులు, విజిలెన్స్‌వాళ్ళ తిప్పలు. ఎన్ని రకాల సేవల్ని చేస్తున్నాడు తను! అయినా ఆఫీసర్లు కనికరించడం కలగానే మిగిలిపోతుంది. హక్కుగా అనుకుంటారు, దేన్నీ అడగడానికీ అభ్యంతర పడరు. 'కోడిని తీస్కరా', 'క్వార్టర్ పట్కరా', 'మీ దగ్గర చాపలు బాగ దొర్కుతయంట గద' 'ఇంటి నాదిరి చాలా రోజులయ్యింది, నాసన తగలక తల్లడిల్లు తున్నం ఆలోచించకపోతివి, జర్రంత మంచిదాన్ని తీస్కరా'- ఒక్కటేమిటి అన్ని రకాల కోరికలు!

తీరా నెల గడ్చేసరికి మళ్ళీ రైస్ మిల్లర్‌ని బతిమి లాడడం, వాడు ఇచ్చినందుకు వానికీ భాగం. ఈ పని మానేస్తే ఇంకేం పని చేయగల్గుతడు తను! పోనీ మానేద్దామన్నా, మాననిస్తరా? 'అట్లా కూసున్నవేంది ధర్మాబాద్ వచ్చింది' తట్టి లేపింది భారతి.

** ** **

"ఇయ్యాలేంది ఇట్లున్నవు?"

"ఏ ఏం లేదు- బాగనే వున్న" రఘుపతి అడిగినదానికి జవాబిచ్చాడు సురేష్.

"అగ్గోర బిడ్డ ఎంత కాదన్న నీతోని చానా దినాల నుండి పని చేస్తున్న అంత మాత్రం తెల్వదనుకున్నావ్!"

"నిజంగ చెబ్తున్న కద- ఏం లేదంటె"

"నువ్వే అనుకుంటె ఎప్పుడు నవ్వుకుంట, నవ్విస్త వుండే భారతి ఏంది, అది కూడ అట్లనే వున్నది! ఏమయ్యింది ఇయ్యాలా?"

"ధర మా రంజుగున్నది. అయిన ఇట్లున్నవేందిరా" అడిగాడు రాజన్న.

ధర బాగున్నా సురేష్‌కు సంతోషంగా లేదు. మన సులో అంతా దిగులు.

భారతి వైపు చూశాడు.

కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడలేని భారతి చూపుల్ని మరల్చుకుంది.

ఆ చూపుల్లో 'తప్పంతా నీదే' అన్న భావం భారతికి కనిపించింది.

'భారతీ!' పిలిచాడు.

'ఆ.. ఏంది' సురేష్‌వైపు చూసింది.

ఇందాక కనిపించిన కోపం కనిపించలేదు. 'ఇది ఇట్లయ్యిందేంది' అని జాలిగా అడుగుతున్నట్లున్నాయి ఆ కళ్ళు.

'నిన్న ఆవేశంలో తిట్టిన తిట్లకి కోపమొచ్చిందా' అని అడిగినట్లున్నాయా చూపులు.

'నిన్న కోపంలో చెయ్యి చేసుకున్నాను. నన్ను క్షమిం చవూ' అని అడుగుతున్న చూపులవి.

'మొగుడివి- నీకు కోపం రాకపోతే ఇంకెవరికొస్తది? కొడితే మాత్రమేంది మొగుడివి నీకు ఆ మాత్రం అధి కారం లేదా, ఏమీ ఆలోచించకు' అంటున్నట్టుగా కని పించాయి భారతి చూపులు సురేష్‌కి.

'ఏం చేద్దామనుకుంటున్నవ్' భారతి అడిగింది.

'నా పానం పొయ్యినా సరే ఆ పని కానియ్య'

'సార్లకి కోపం వస్తది- మన యాపారం ఎట్ల'


'కోపం ఎందుకొస్తది, వాళ్ళకిచ్చేది వాళ్ళ కిస్తం లేమా'?

'యాదుంచుకుంటరంటవా! ఇన్ని దినాలు చేసిన సేవలు...'

'ఏమోమరి- ఎక్కువ చదువుకున్నోళ్లు, నమ్ముడు కష్టం'

...

'జబర్దస్తీగనయితే అడుగలేదు, బతిమిలాడినట్లనే అడిగిన్ను, మూర్ఖాం ఎట్ల అయ్యేదుంటే అట్లయితది.'



'మళ్లీ నాయబ్ సార్ వస్తుండు. ఎవరికి మూడిందో ఇయ్యాల' ఎవరో అన్నారు.

'రోజులెక్క కాదు- ఇయ్యాల నల్గురు పోలీసులని తీసుకొని వస్తుండు' ఇంకెవరో అన్నారు.

సురేష్ గుండెల్లో రాయి పడింది.

భారతి మనసులో అగ్నిపర్వతం రగిలింది.

'బిడ్డల్లార పోనీ పాపమని ఇన్ని రోజుల్నుంచి చూస్తున్న, ఇంగ చూపిస్త నా తడాక, రోజుకొక్కరు చూడుండ్రి ఏమయితదో' అన్నాడు నాయబ్ సాబ్.

'ఏమయ్యింది సార్ .. ఏమయ్యింది' అడిగారు అందరు.

'సార్‌కి కోపం రానియ్యకుండ్రయ్యా అంటే విన్నరా' అన్నాడు అటెండర్.

'మాఫ్ జెయ్యాండ్రి సార్- తప్పయ్యింది.. ఏం జెయ్యమంటరు?' అందరి తరపున అడిగాడు రఘుపతి.

'ఏడ నక్కిండో సూడు ఆడు' అటెండర్‌తో అన్నాడు నాయబ్ సాబ్.

'రోజు ఈడనే వుంటుండె, రాలేదా ఏంది' స్వగతంలో అనుకున్నాడు అటెండర్.

'ఎవరు సార్' అందరి నోటి నుండి వచ్చింది ప్రశ్న.

'ఏంరా బిడ్డల్లార మస్కా కొడుతున్నార్.'

'తిక్కలోని లెక్క ఆడేం చూస్తున్నవ్ లోపలికి పొయ్యి చూడు' అటెండర్ని కసురుకున్నాడు.

'ఏందే ముసల్దాన అరవై ఏండ్లల్ల 'పున్నపు- ఇప్పుడు కడుపొచ్చిందా? కడుపంత లావయ్యింది. లం.., కథలు నేర్చుకున్నరు కడుపులల్ల బస్తలు దాస్తున్నరు, నైను పిల్ల లెక్క తొడలు అంత సక్కంగున్నయేంది, లంగలల్ల కూడ బస్తలు దూరుస్తున్నారు'

'మాఫ్ జెయ్యిదొర బాంచన్'- కాళ్ళు పట్టుకుంది ముసలి మంగి.

'బేఫికర్ గుండుండ్రి ఇయ్యాల మిమ్మల్నందర్ని వదిలిపెడుతున్న నాకు ఒక్కడే కావాలి. ఆడు లేకుంటే మీ పని బద్ద'

'ఇంగో సార్ ఈడ నక్కిండు' సురేష్‌ని చూపిస్తూ అన్నాడు అటెండర్.

'పట్టుకో లంజాకొడ్కుని, జప్తు చెయ్యి ఆని మాల్'

'బాంచన్ దొర కాల్మొక్త మాఫ్ జెయ్యుండ్రి, నా మొఖం చూసన్న వదిలిపెట్టుని' అడిగింది భారతి.

'నీ మొఖం చూసి వదిలి పెట్టాలి, నువ్వు నాకేమన్న సుట్టానివా, లేకపోతె ఇంకేమన్న సంబంధం వున్నదా నోర్మూయ్యవే లం..'

రైలు నుండి లాగుతున్న వడ్ల బస్తాలని పట్టుకొని 'సార్ నన్ను మాఫ్ జెయ్యండ్రి సార్, పెద్ద సారు ఈపు మీద కొట్టుండ్రి, కడుపు మీద కొట్టకుండ్రి'

'ఆ. నాకే నీతులు చెబుతున్నావ్ దొంగనా మాక్కా సాలేకో'

'ఏంది సార్- మా బస్తాలనే ఎందుకు జప్తు చేస్తున్నరు' అడిగాడు లక్ష్మన్ సురేష్ కొడుకు.

'ఆ. ఖామోష్ కావాల్సొచ్చినాది రా నీకు, జవాబ్ ఈడికిరా ఈడ్ని ఈడనే ఖతం జెయ్యండ్రి ఏమను కుంటున్నడో'

కోపంగా నాయబ్ సాబ్‌ని చూస్తున్న కొడుకు చెంపని ముద్దు పెట్టుకుంది సురేష్ చెయ్యి. 'నీకెందుకురా పెద్దోల్ల మాటలల్ల నువ్వు తలపెడ్తనేంది, మాఫ్ జెయ్యండ్రి సార్ చిన్న పోరగాడు తెల్వకడిగిండు, ఉడుకు నెత్తురు అయిపోయింది, మారాజులు మీతోని పెట్టుకుంటే అయితాది'

'ఉడుకు నెత్తురున్నాది అందుకని అంటున్నాడు ఛోడ్‌నాసయ్ సాలేకో, పోలీస్ ఇధర్ ఆవ్- ఈని నెత్తుర్ల గరమున్నదంట, జర రంత ఠండ జెయ్యరాదు'

లాఠీలు తమ పని కొనసాగించాయి.

'పోలీస్ కేస్ బుక్ చెయ్యండి, ఈన్ని బొక్కల బెట్టండి' ఆర్డర్ జారీ చేసాడు పోలీసులకి.

'నువ్వేమన్న జెయ్యిసార్ నా బిడ్డని పేరు పోలీసుల కాయితాలల్ల ఎక్కనియ్యకుండ్రి, ఆని బతుకు కుక్కలు చింపిన ఇస్తరయితది'సురేష్ దాదాపుగా ఏడుస్తున్నాడు.

'ఈడేమొ అంటున్నాడు, ఈనికి సంగతి జెప్పు' అటెండర్‌తో అని నాయబ్ సాబ్ కదిలిపోయాడు.

'నేను జెప్పింది యాదున్నది కద, మూడు దినాలు చూస్తం, మేము అడిగింది చేస్తివా సరి, లేదంటే మాసొక్క నీ కొడ్కుని' అటెండర్ బెదిరింపు, హెచ్చరింపు.

ఊగిన పచ్చ జెండాని చూసి కదిలిపోయింది రైలు.

** ** **

'ఏంరా బిడ్డ సురేష్ అట్లున్నవ్ లక్ష్మన్‌గాన్ని ఇంకా వదుల లేదా?' అడిగాడు రఘుపతి.

'లే కాక, ఇంకా వదుల లేదు'

'పొయ్యి కల్వకపోయినావు, వాల్ల సంగతి తెల్వనోని లెక్క చేస్తున్నవేంది, పైసల మనుషులయిరి'

భారతి చూపులు సురేష్ చూపులో కలిసినయ్.

మనం సట్టుల వున్నట్లయితె ఎట్లయితది, ఈ రకం యాపారానికి అలవాటయినోల్లం, మన పని మరిసిపోదామన్న కాదు, ఇంగ దాంట్లనే జిందగీ అంత గడపాల్సొస్తది.

'నువ్వు నిజంగ మంచిపని చేసినవ్ నీ కొడుకుల్ని దీంట్లకి గుంజకుండ' భారతి అంది.

'ఇంతకీ ఏమడుగుతున్నరు, ఎప్పుడిడుస్తరంట'

'వాళ్ళు అడగాల్సిందే అడిగ్రను, ఇయ్యాల వదుల్తమన్నరు'

కొద్దిసేపట్లో తన కొడుకుని చూడగలుగుతాడు తను, ఈ మూడు దినాలు తిన్నడో లేదో, ఆల్ల కోపం ఎన్ని కీల్లని గుంజినయో ఈనిని,' మనసు రైలు వేగంతో సమానంగా పరిగెత్తుతున్నది.

తన కొడుకుతో పాటే.. సన్నగా మూల్గింది సురేష్ మనసు.

'అంగో, అంగో లక్ష్మన్ వచ్చిండు' కనిపించిన కొడుకుని చూసి అరిసినంత పని చేసింది భారతి.

సురేష్‌కి విడుదలయ్యి వచ్చిన కొడుకు కంటే కూడా అల్లంత దూరంలో అటెండర్ ప్రక్కన వున్న తన బిడ్డ 'ఇందిర' కనిపించింది. బిడ్డ కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూడలేకపోయాడు.

అలసిపోయిన బిడ్డ చూపు 'నువ్వు తండ్రివేనా' అని ప్రశ్నించినట్టు కనిపించింది. 'రైలు ప్రయాణం అని చెప్పి నువ్వు చేసిన పనేంటి? నీ కొడుకుని నిర్బంధం నుండి విడిపించడానికి నన్ను బందీని చేస్తావా?' అని అడుగుతున్నట్టుగా అనిపించింది.

భారతి ప్రక్కన వచ్చి కూర్చుంది ఇందిర.

సురేష్ మనసు తనని తాను పరిపరి విధాలుగా దూషించుకుంటోంది, కళ్ళదాకా వచ్చిన నీళ్ళు లోకం కొరకు కళ్ళలోనే ఇంకిపోతున్నాయి. ఎంత ఘోరమయిన తండ్రి తను? ఎంత క్రూరమయిన పనిని చేయగల్గింది తన తండ్రి హృదయం!

తన బిడ్డ అనుకునేసరికి ఇన్ని రకాలయిన ఆలోచనలు! గంగ, లచ్మి, నిర్మల, సోని. సీత,... ... ఎన్నో పేర్లు గుర్తుకు వచ్చాయి సురేష్‌కి.

'ఇంటిని నదిలి చాలా రోజులయ్యింది' అన్న సార్లకి కొందరికి చెప్పి, కొందరికి చెప్పకుండానే అప్పగించి ఎంత బాగా ఆనందం పంచుతున్నాడు తను, ఇవ్వాళ ఇట్లా బాధ పడడం దేనికి?

'మాల్ తీస్కపో రేపు, నీ కొడుకుమీద కేసు పెట్ట లేదు, వచ్చే నెల పైసలివ్వాల్సింది లేదని సార్ చెప్పిండు, బేఫికర్‌గుండు'

అటెండర్ లోగొంతుకలో అన్న మాటలు సురేష్ చెవికి వినిపిస్తున్నాయి కానీ, మనసుకు వినిపించడం లేదు.

## ఆటోగ్రాఫ్—ఫోటోగ్రాఫ్



సి.ఎస్.ఆర్. ఆంజనేయులుగారు నాటకరంగం మీద కృష్ణ పాత్ర ధారిగా అపార ఖ్యాతి నార్జించారు. ఆయన పద్య పఠనంలోని నాదుపు ఆస్వాదించారు. అమితంగా ఆకర్షించింది. సి.ఎస్.ఆర్. సినీ రంగం లో ప్రవేశించిన తర్వాత జీవితం, కన్యాశుల్కం, కన్యా దానం, అప్పుచేసి పప్పుకూడు వంటి సినిమాలలో అజరామరమైన నటనను ప్రదర్శించారు. శకుని, రామప్పంతులు వంటి పాత్రలను కళ్ళకు కట్టించారు.

—వి.డి.ఎన్. కౌండిన్య,
ఎం.ఐ.జి. 39, ఎ.పి.హెచ్.బి. కాలనీ,
మేడ్చల్ - 501 401.